క్లుప్తంగా

నేడు రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ సమావేశం

మోతీనగర్: రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు మాననీయ నగర సంఘ చాలక్ డా. ఎస్‌కె. జైస్వాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు మోతీనగర్‌లోని విజేత సూపర్ మార్కెట్ పైన జష్న్ బ్యాంక్విట్ హాలులో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రపతి భవన్‌ను సందర్శించిన విద్యార్థులు



మూసాపేట: మూసాపేట శ్రీహరి నగర్‌లోని విజ్ఞి పాఠశాల విద్యార్థులు శనివారం నగరంలోని రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు. విద్యార్థులకు రాష్ట్రపతి భవన్‌ను చూపించి అందులోని విశేషాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రావణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



ఆల్విన్‌కాలనీ: డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు అన్నారు. ఎన్‌టీఆర్ నగర్‌లోని చాలీస్ మఖాన్‌లో కొన్ని నెలలుగా డ్రైనేజీ పొంగి రోడ్లపై ప్రవహిస్తుంది. విషయం తెలుసుకున్న ఆయన శనివారం పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులకు సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రీతి, ఫజల్, ఫరీదా బేగం, లక్ష్మి, రాములు గౌడ్, జగదీష్, మాధవరెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణ మాసం పూజలు



శారదాంబ అమ్మవారు

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారద శంకరమఠంలో శ్రావణమాసం ముగింపు సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శారదాంబ దేవిని గాజులతో అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: డ్రైనేజీల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్‌లోని చాలీస్ మకాన్‌కాలనీలో డ్రైనేజీ పొంగి వరద రోడ్లపై ప్రవహిస్తుంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శనివారం కాలనీలో శనివారం పర్యటించారు. నీటిని వెంటనే తొలగించాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టి గౌడ్, మల్లేష్, ప్రభాకర్, వాలి నాగేశ్వరరావు, భిక్షపతి, మల్లేష్, మధులత, నస్రీన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ఆల్విన్‌కాలనీ: విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీస్ రాజయోగ మెడిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి, వివేకానందనగర్, సుభాష్ భవన్ ప్రాంగణంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం వల్ల అనేక మంది ప్రాణాలు కాపాడబడతాయని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్, వివేకానందనగర్ కాలనీ వాసులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, రామ్‌దేవ్‌రావు వైద్య బృందం పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు!

కిందకు వేలాడుతుండటంతో పొంచి ఉన్న ప్రమాదం



అవంతినగర్ తోటలో ఇళ్ల మధ్యన వివిధ రకాల కేబుల్స్, విద్యుత్ వైరు



తులసినగర్ సీ బ్లాక్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

మోతీనగర్: ఆయా కాలనీల్లో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ఉన్నాయి. దీంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అల్లాపూర్ డివిజన్ తులసినగర్ సీ బ్లాక్‌లో ఇళ్ల మధ్యన ప్రధాన విద్యుత్ సరఫరా అయ్యే హైటెన్షన్ వైరు చేతికి అందేంత ఎత్తులో ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఇటీవల సుమారు పది రోజుల పాటు వర్షాలు కురిసినప్పుడు ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు నేలపై పడిపోతాయేమోనని ఆందోళనకు గురయ్యారు. ఆరుబయటకు పిల్లలు, వృద్ధులు రావాలన్నా ఆలోచించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కిందకు వేలాడుతున్న విద్యుత్ హైటెన్షన్ వైర్లను సరిచేయడంతో పాటు శాశ్వత పరమ్మతులు చేపట్టాలని పలుమారు అధికారులకు స్థానికులు విన్నవించారు. అయినా ఫలితం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూసాపేట డివిజన్‌లోని అవంతినగర్ తోట, బబ్బుగూడ, స్నేహపురి కాలనీ, కబీర్‌నగర్, పాండురంగనగర్, వీకర్‌సెక్షన్, బాలాజీ స్వర్ణపురి కాలనీ, మోతీనగర్‌తో పలు బస్తీ కాలనీలలో హైటెన్షన్ వైర్లతో పాటు వివిధ కేబుల్ వైర్లు ఉన్నాయి. అదే విధంగా అల్లాపూర్ డివిజన్ తులసినగర్, గాయత్రినగర్, వివేకానందనగర్, న్యూ అల్లాపూర్ సెంట్రల్, వి. రామారావునగర్, కొత్తూరు సీతయ్య నగర్, సఫ్దార్‌నగర్, యూసుఫ్ నగర్, రాజీవ్ గాంధీ నగర్‌లలో విద్యుత్ హైటెన్షన్ వైర్లతో పాటు పలు కేబుల్ వైర్లు విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేశారు. అల్లాపూర్ డివిజన్‌లోని పలు బస్తీలలో విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్‌వైర్లను తొలగించి అక్కడే వదిలేశారు. ఎక్కడ తొలగించారో అక్కడే వదిలి వేయటంతో పాదాచారులకు, పిల్లలకు కాళ్లలో పడి ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంది. వాటిని వెంటనే తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

“ తులసినగర్ సీ బ్లాక్‌లో కొన్ని రోజుల నుంచి ప్రధాన విద్యుత్ హైటెన్షన్ వైర్లు వదులుగా ఉన్నాయి. కిందకు వేలాడుతుండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. సంబంధిత అధికారులు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి. గతంలో విన్నవించినా అధికారులు పట్టించుకోలేదు. కేబుల్ వైర్లను తొలగించడం శుభపరిణామమే. వాటిని వెంటనే తరలించాలి. ”

– విజయ్‌కుమార్, తులసినగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి

సమస్యలు పరిష్కరించాలని వినతి



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిచాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్‌ను శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవరింటి మస్తాన్‌రెడ్డి, కాలనీ వాసులు కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. జీహెచ్‌ఎంసీ, హైడ్రా, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వివేకానందనగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వార్డు కార్యాలయాన్ని మరో ప్రాంతానికి తరలించాలని కోరారు. కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, చిన్న వర్షం వచ్చినా డ్రైనేజీలు పొంగి, మురుగునీరుతో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా వివధ సమస్యలు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పట్లోళ్ల నాగిరెడ్డి, వీ టీమ్ ప్రధాన కార్యదర్శి రవీందర్, జనార్దన్ చారి, ఆర్. సత్యనారాయణ, రమేష్ ఆచారీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కార్పొరేటర్ సబిహాబేగం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ ఇండోర్ షటిల్ కోర్టు స్టేడియంలో రూ.35 లక్షల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇండోర్ షటిల్ కోర్టులో డ్రస్సింగ్ రూమ్, బోర్, టాయిలెట్స్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణం వేగంగా చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్కు ఇన్‌స్పెక్టర్ వినాయకరావు, స్థానిక నాయకులు కృష్ణారావు, జితేందర్, కాశీనాథ్ చారి, యూసుఫ్, రఘు, రమణ, యోగిరాజు, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు అందజేస్తున్న విజయరాణి, నాగిరెడ్డి

మూసాపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అర్బన్ బయోడైవర్సిటీ కార్యనిర్వహణాధికారి విజయరాణి, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి అన్నారు. శనివారం భరత్‌నగర్ కాలనీలోని శ్రీహరి హర క్షేత్రంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యం వల్ల వాతావరణ సమతుల్యత లోపిస్తుందన్నారు. దీంతో మన ఆరోగ్యమే కాకుండా అనేక రకాలైన జీవ జాతుల మనుగడ ప్రమాదంలో పడిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్, నరేష్, శ్రీను, అనీల్, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుల తయారీ అభినందనీయం



మట్టి వినాయకుడిని అందుకుంటున్న కలెక్టర్ మనుచౌదరి



నిర్మాణంలో ఉన్న బ్లాక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

– జిల్లా కలెక్టర్ మను చౌదరి

కూకట్‌పల్లి: విద్యార్థులు మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేయడం అభినందనీయమని కలెక్టర్ మను చౌదరి అన్నారు. శనివారం కూకట్‌పల్లి జూనియర్, డిగ్రీ కళాశాలను పరిశీలించారు. ఇంటర్, డిగ్రీలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని తెలుసుకున్నారు. పాత బ్లాకులను పరిశీలించి శిథిలావస్థలో ఉన్న వాటికి కొత్త భవనాలను నిర్మించాలని సూచించారు. పక్కనే నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించి తరగతి గదులు, ల్యాబ్‌లు సరిపోతున్నాయా? అని ఆరా తీశారు. కాలేజీలో కొన్ని బ్లాక్‌లో కరెంటు సమస్యలు ఉన్నాయని ప్రిన్సిపాల్ కలెక్టర్‌కు తెలుపగా.. విద్యుత్ శాఖ వారిని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం కాలేజీ ఆవరణలో కలెక్టర్ మను చౌదరి మొక్క నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ పద్మావతి, కూకట్‌పల్లి తహసీల్దార్ స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ కుంటను సుందరీకరించాలి

కార్పొరేటర్ సతీష్ గౌడ్

బాలానగర్: వాల్మీకి నగర్‌లోని శివాలయం వద్ద ఉన్న బతుకమ్మ కొలనును సుందరీకరించాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. శనివారం కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మలను వేయడానికి మూడు వైపులా మెట్లని ఏర్పాటు చేసి సుందరీకరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శివాలయం చైర్మన్ నర్సింగ్‌రావు, వరాహస్వామి, భిక్షపతి, రాము, కుమార్, చందు, మల్లికార్జున్, నాగరాజు, ప్రవీణ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

సురవరం మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

బాలానగర్: సురవరం సుధాకర్‌రెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ అన్నారు. శనివారం శ్రీశ్రీ నగర్ సీపీఐ కార్యాలయంలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురవరం సుధాకర్ రెడ్డి జీవితం అంతా కూలీలు, కర్షకులు, మధ్య తరగతి ప్రజల హక్కుల కోసం అంకితం చేశారన్నారు. విద్యార్థి దశ నుంచి పార్టీ త్యాగయాత్రలో, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగించారన్నారు. నేటి తరం ఆయను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె. మనోచారి, రాజుగౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

విజయగణపతి ఆలయంలో ప్రవచనాలు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్ 9లోని విజయగణపతి దేవాలయంలో ప్రవచన చక్రవర్తి, వాచస్పతి బ్రహ్మశ్రీ డా. చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు శని, ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం జరిగిన కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పాల్గొని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాన్ని ఆలకించారు.



ప్రవచన కార్యక్రమానికి హాజరైన భక్తులు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- ప్రజా సమస్యలను వెలికితీసి పరిష్కారానికి కృషి చేయాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం నియోజకవర్గ కార్పొరేటర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధనాలతో ప్రజలు విసుగెత్తారన్నారు. ఏ సమస్య కూడా పరిష్కారానికి నోచుకోవటం లేదని విమర్శించారు. విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, మంచినీరు వంటి సదుపాయాలు కూడా సరిగ్గా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లోకి వెళ్లి పాదయాత్రల ద్వారా వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, పగుడాల శిరీష, ముద్దం నరసింహయాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, మహేశ్వరి శ్రీహరి, మాజీ కార్పొరేటర్‌లు శ్రావణ్‌కుమార్, బాబురావు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మట్టి వినాయకుల పంపిణీలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు

- పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ
- హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: మట్టి వినాయకుల పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన 6 వేల మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని వివేకానందనగర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6 వేల మట్టి వినాయకుల ప్రతిమలు పంపిణీ చేయటం అభినందించదగ్గ విషయమన్నారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. చెరువులను కలుషితం చేయకుండా వీలైనంత వరకు మట్టి వినాయకులను మన స్వగృహ ప్రాంగణంలోనే నిమజ్జనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి, నాయకులు సంజీవ రెడ్డి, సత్యనారాయణ, ఎండీ ఇబ్రహీం, సురేందర్ రెడ్డి, అష్రాఫ్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఆల్విన్‌కాలనీ: సీనియర్ పాత్రికేయుడు విద్యా వెంకట్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రాందేవ్ రావ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పీఏసీ చైర్మన్ గాంధీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునే విధంగా చూడాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ యోబు, నాయకులు పరేందర్ రెడ్డి, ఆనంద్, రాహుల్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం బలోపేతానికి కృషి చేయాలి



కూకట్‌పల్లి: విద్యార్థి సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని జేఎన్‌టీయూహెచ్ ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ సన్నీ ఇమన్యుయేల్ శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన్ను కలిశారు. బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరావు వారిని సన్మానించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ జాక్ స్టేట్ ప్రెసిడెంట్ సందీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ దాస్యం విక్రాంత్, శ్రీకాంత్, రాంచరణ్, ఉదయ్ తివారి, శశిప్రీతం, సలీం, భార్గవ్, అభిషేక్, సృజన్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో సరస్వతి విద్యాపీఠం మేడ్చల్ జిల్లా స్థాయి జ్ఞాన విజ్ఞాన మేళాను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. డి. నివేదిత నేత్ర వైద్యురాలు హాజరై సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. విద్యార్థులు సైన్స్, మ్యాథ్స్ నమూనాలను ప్రదర్శించారు. క్విజ్ పోటీలో పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

సమస్యల పరిష్కారానికి కృషి

– చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై శనివారం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్‌తో కలిసి పర్యటించారు. హైదర్‌నగర్ డివిజన్ రామ్‌నరేష్ నగర్ కాలనీ, ఆలీ తలాబ్ చెరువులో డ్రైనేజీ నీరు కలిసి కలుషితం, చెత్తాచెదారంతో దుర్గంధం, దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు పడుతున్నారని దీనికి త్వరలో పరిష్కారం చూపుతానన్నారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో పాల్గొని తన దృష్టికి వచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం రవికుమార్ యాదవ్ ఆలీ తలాబ్ చెరువు చుట్టు మొక్కలు నాటి, వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవీందర్‌రావు, అరుణ్‌కుమార్, కృష్ణంరాజు, సునీల్ రెడ్డి, సీతారామరాజు, రాధాకృష్ణ యాదవ్, అంబాదాస్, వీరాచారి, కృష్ణ, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి జేఎన్‌టీయూలో స్పాట్ అడ్మిషన్స్

బాలానగర్: జేఎన్‌టీయూ పరిధిలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో భర్తీ కాకుండా మిగిలిన ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం బీటెక్ సీట్లకు ఈ నెల 26 నుంచి స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు అడ్మిషన్ విభాగం డైరెక్టర్ బాలు నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని వర్సిటీ అడ్మిషన్స్ కార్యాలయంలో ఈ 29వ తేదీ వరకు అడ్మిషన్స్ పొందవచ్చన్నారు. 978 సీట్లను స్పాట్ అడ్మిషన్స్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌లో ఉతీర్ణులు కాలేకపోయిన విద్యార్థులు సైతం హాజరు కావచ్చని తెలిపారు.

కనకదుర్గ ఆలయంలో పూజలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: అమావాస్య సందర్భంగా అంజయ్యనగర్ రిటైల్ మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమాలు చేశారు. రిటైల్ కూరగాయల మార్కెట్ చైర్మన్ సత్యనారాయణ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ గావించారు.

